సాక్షి
తిరుపతి
మంగళవారం । 12 । నవంబర్ । 2024



బెల్టు తీస్తున్నారు!

చంద్రగిరి నియోజకవర్గంలో బెల్టుషాపుల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. - 8లో



భయపడొద్దు..

మహిళలు భయపడొద్దు.. ప్రలోభాలకు గురికావద్దని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. - 8లో



అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్వీయూ వీసీ సీహెచ్.అప్పారావు పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

సముద్రం అల్లకల్లోలం



తూపిలిపాళెం వద్ద ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు

వాకాడు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో సోమవారం వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు విశాఖ వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసినట్లు తెలిసింది. దీని ప్రభావంతో రెండు రోజులుగా సముద్రంలో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సముద్రంపై ఒక్కసారిగా హోరు గాలి, సుడులు తిరుగుతున్న అలల ఉధృతి అధికంగా పెరిగింది. దాదాపు 7 మీటర్లు ఎత్తుకు అలలు ఎగసి పడుతున్నాయి. సముద్రపు ఒడ్డున కనీసం నిలబడలేని పరిస్థితిలో ఇసుకతో కూడిన హోరుగాలి వీస్తోంది. మత్స్యకారులు రెండు రోజులుగా వేట నిలిపేశారు. పెద్ద బోట్లు ద్వారా వారం రోజులుగా సముద్రంపై వేటలో ఉన్న మత్స్యకారులు సైతం భయంతో ఒడ్డుకు చేరుకున్నారు. రెండు నెలలుగా సముద్రంలో మత్స్య సంపద దొరక్కపోగా తరచూ కడలిపై విపత్తులు చోటు చేసుకోవడంతో మత్స్యకారులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇలాంటి దుస్థితి ఎప్పుడూ రాలేదని మత్స్యకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,233 మంది స్వామివారిని దర్శించుకోగా 26,415 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చౌక దుకాణాలపై.. పచ్చ గద్దలు

తిరుపతి జిల్లాలో కూటమి నేతలు రేషన్ షాపు డీలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. తమకు అనుకూలంగా లేరంటూ పలువురిని నిర్దాక్షిణ్యంగా మార్చేస్తున్నారు. మాట వినని వారిని అధికారుల చేత బెదిరించి మరీ రాజీనామా చేయిస్తున్నారు. ఆపై తమకు అనుకూలమైన వారిని నియమించుకుని రేషన్ సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ విషయాలన్నీ సంబంధిత అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.





- వెంకటగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో డీలర్లను ఇష్టారాజ్యంగా మార్చేశారు. తమకు అనుకూలంగా లేరంటూ సైదాపురం మండలంలో ఐదుగురు, బాలాయపల్లె మండలంలో నలుగురి డీలర్లపై వేటు వేశారు. ఆయా డీలర్ల స్థానంలో కూటమి నేతలు కొత్తగా తమకు అనుకూలంగా ఉన్న వారిని అనధికారికంగా నియమించుకుని షాపులు నిర్వహిస్తున్నారు.

- ఇష్టారాజ్యంగా చౌకదుకాణాల నిర్వహణ
- తమకు అనుకూలంగా లేరంటూ పలువురు డీలర్ల మార్పు
- లొంగని డీలర్లకు అధికారుల చేత బెదిరింపులు
- రేషన్ బియ్యం పక్కదారిపడుతున్నా పట్టించుకోని వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో చౌకదుకాణాల నిర్వహణ గందరగోళంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కక్షసాధింపులకు పాల్పడుతోంది. గత ఎన్నికల్లో తమకు ఓట్లు వేయలేదని.. లేదా తాము చెప్పినట్లు వినలేదన్న సాకుతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న డీలర్లను సైతం పక్కన పెట్టేస్తోంది. మాట వినని డీలర్లను నయానో.. భయానో తొలగించి పబ్బం గడుపుకుంటోంది. ఆ తర్వాత తమకు అనుకూలమైన వారిని నియమించుకుని కొత్త సంస్కృతికి బీజం వేస్తోంది.

పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

కొత్తగా షాపులు దక్కించుకున్న కూటమి నేతలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది. రేషన్ షాపుల వద్దే ప్రయివేటు వ్యక్తులకు బియ్యం విక్రయిస్తున్నట్టు కార్డుదారులు చెబుతున్నారు. బియ్యం వద్దనుకున్న కార్డుదారుల వద్ద కిలో రూ.13 చొప్పున కొనుగోలు చేసి ప్రయివేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. అలాగే సకాలంలో బియ్యం తీసుకోని కార్డుదారులకు వారికి రావాల్సిన బియ్యానికి బదులు డబ్బులు ముట్టజెబుతున్నట్టు తెలుస్తోంది. మరో పక్క కార్డుదారుల వద్ద కిలో రూ.10 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేసి ప్రయివేటు వ్యక్తులకు విక్రయిస్తున్నట్టు సమాచారం.



గతంలో ఇంటి వద్దే రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు



ప్రస్తుతం రేషన్ షాపు వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

జిల్లా సమాచారం	మండలాలు	రేషన్ షాపులు	ప్రతినెలా అందే బియ్యం కిలోలు	చక్కెర మెట్రిక్ టన్నులు	కందిపప్పు మెట్రిక్ టన్నులు
	34	1,457	6,03,000	610	305

తప్పుకోండి.. లేదా రాజీనామా చేయండి

కూటమి నేతలు తమకనుకూలమైన వారికి రేషన్ షాపులు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఇప్పటికే పలువురు డీలర్లను అకారణంగా తీసివేసి తమవారిని నియమించుకున్న నేతలు.. మాట వినని డీలర్లను అధికారుల చేత బెదిరిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో అధికారికంగా 85 షాపులు ఖాళీగా ఉన్నా యి. ఆయా షాపులకు నోటిఫికేషన్ ఇచ్చి డీలర్లను నియమించాల్సి ఉంది. కానీ తెలుగు తమ్ముళ్లు అధికారులతో కుమ్మక్కై తమకు అనుకూలమైన వారికి ఆయా షాపులు కట్టబెట్టినట్టు తెలుస్తోంది. మరి కొన్ని షాపులు పాత డీలర్లతో రాజీనామా చేయించి వారిపేరుతోనే టీడీపీ వారు నిర్వహించుకునేలా సెటిల్‌మెంట్ చేసిన ట్టు సమాచారం.

తిరుపతి జిల్లాలోని చిల్లకూరు మండలంలో ఓ రేషన్ షాపు డీలర్‌కు సాధారణంగా ప్రతి నెలా 5 టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఐదు టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చి రికార్డుల్లో పది టన్నులు ఇచ్చినట్టు రాసేశారు. ఈ తప్పును సరిదిద్దాలని సదరు డీలర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరు.

సరుకుల కోసం ముప్పతిప్పలు

గత ప్రభుత్వంలో రేషన్ బండి ఇంటివద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక పక్క డీలర్లను మార్పు చేయడంతోపాటు కొత్తవారికి కట్టబెట్టడంతో వారు ఎక్కడ షాపులు పెట్టారో.. ఎక్కడ సరుకులు ఇస్తున్నారో తెలియక తికమక పడాల్సి వస్తోంది. కొందరైతే కనీసం బోర్డులు కూడా పెట్టకుండా తమ ఇళ్లల్లో రేషన్ షాపులు నిర్వహిస్తుండడంతో కార్డుదారులు ఆపసోపాలు పడాల్సిన దుస్థితి నెలకొంది.





రెండు కిలోమీటర్ల దూరం నుంచి రేషన్ బియ్యం నెత్తిన పెట్టుకుని వస్తున్న తిప్పిరెడ్డిపల్లె వాసులు

పనులు మానుకుని తిరుగుతున్నాం



రేషన్ బియ్యం కోసం పనులు మానుకోని తెచ్చుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో పీడీఎస్ వాహనం ద్వారా మా కాలనీలోని ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులను అందించే వారు. కానీ ఇప్పుడు రేషన్ కోసం కష్టాలు పడుతున్నాం. రేషన్ సరుకుల కోసం రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది.

– పుల్లమ్మ, తిప్పిరెడ్డిపల్లి

ఒత్తిడి వల్లే మానేశా



గత రెండేళ్లుగా రేషన్ షాపును నడుపుకుంటున్నా. ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. నెల నెలా పేదలకు బియ్యంతో పాటు చక్కెర అందించేదాన్ని. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అధికారుల ఒత్తిడి కారణంగా డీలర్ పదవికి రాజీనామా చేసి, షాపును వదిలేశా. ఇలాంటి వేధింపులు ఎప్పుడూ లేవు.

–తిరకాలవిజయ, ఊటుకూరు, సైదాపురం మండలం

రెండు కిలోమీటర్లు వెళ్తున్నాం



రేషన్ సరుకుల కోసం ప్రతి నెలా పనులు మానుకుని రెండు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నాం. గతంలో మాదిరిగా ఇప్పుడు మళ్లీ బాధలు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఇంటి వద్దే సరుకులు అందించేది. ఇప్పుడు నరకయాతన పడుతున్నాం.

– శంకరమ్మ, కార్డుదారు

కోతలేనా కేశవా

బాబుగారి భజన.. గత ప్రభుత్వంపై విమర్శలు.. అంకెల గారడీలు.. ప్రజలను మభ్యపెట్టే యత్నాలు.. ఇదీ సోమవారం బడ్జెట్ సమావేశాల సారాంశం. కూటమి ప్రభుత్వం నాలుగు నెలల కోసం పూర్తి స్థాయి బడ్జెట్ అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్లతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిలేదని చెబుతూనే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికం చేసి చూపించారు. ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా, రెవెన్యూలోటు రూ.34,712.84 కోట్లుగా చూపారు. ప్రజలపై నాలుగు నెలలకు రూ.75వేల కోట్ల భారం మోపే విధంగా ప్రణాళిక రచించారు. సూపర్‌సిక్స్‌కు బడ్జెట్‌లో నామమాత్రమే కేటాయించి అంకెల గారడీతో బురిడీ కొట్టించారు. మహిళా సంక్షేమం, ఉన్నత విద్యపై స్పష్టత ఇవ్వకుండా మొండిచేయి చూపారు. రైతులకు ఏటా రూ.20వేలు అందిస్తామని చెప్పి కోలుకోలేని దెబ్బకొట్టారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తం రూ.16వేల కోట్లు అంటూ ప్రగల్భాలు పలికే ప్రయత్నం చేయడంపై మేధావులు, వామపక్ష నేతలు మండిపడుతున్నారు.

– తిరుపతి సిటీ



- కూటమి బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు
- బాబు భజన, బూటకపు మాటలకే పరిమితం
- నాలుగు నెలల బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు సాధ్యమేనా?
- సూపర్ సిక్స్‌కు బడ్జెట్‌లో స్థానం ఏది?
- ప్రజలపై రూ.75వేల కోట్ల భారం
- మహిళా సంక్షేమం, ఉన్నత విద్యకు మొండిచేయి
- పెదవి విరుస్తున్న మేధావులు

పూర్తిగా అంకెల గారడీనే



నాలుగు నెలలకు సంబంధించి అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారిడీగా కనిపిస్తోంది. పూర్తి స్థాయి బడ్జెట్ రూ.1.99లక్షల కోట్లు అయితే అలాంటిది నాలుగు నెలలకు రూ.2.94 లక్షల కోట్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అర్థంలేని, అమలుకు వీలు కాని బడ్జెట్ ఇది. సాగు నీటి ప్రాజెక్టులకు రూ.16 వేల కోట్లు కేటాయించారు. నాలుగు నెలల కాలంలో ఈ బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో ఖర్చుపెట్టగలరా..?. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అంటూ రూ.50వేల కోట్లు అప్పులు చేసేందుకు ప్రయత్నించడం దారుణం.

–ఎం పురుషోత్తంరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్, తిరుపతి

వేతన జీవుల ప్రస్తావనే లేదు



టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో వేతనాలు, కార్మిక సామాజిక భద్రత ప్రస్తావనే లేదు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీమ్ కార్మికులను బడ్జెట్‌లో విస్మరించారు. ధరలు వంద నుంచి 300శాతం పెరిగినా వేతనాల పెంపుపై ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యుత్ చార్జీల భారం మోపిన ప్రభుత్వం, మద్యం అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపు ద్వారా మరిన్ని భారాలు వేసింది.

–కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి .

మహిళా భద్రత ఊసేలేదు



కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉంది. ముఖ్యమంత్రిని కీర్తించడానికే సమయం కటాయించారు. ఆదివాసులు, దళితులు, మహిళల సంక్షేమానికినిధులు అంతంతమాత్రమే.

–వందవాశి నాగరాజ, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి

ప్రజలపై మరింత భారం



ఆర్థిక మంత్రి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ఆర్థిక పరిస్థితి సరిలేదని చెబుతూనే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కంటే బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపారు. విద్యుత్ రంగం విషయంలో ప్రజల పైన భారం పడుతోంది. ఉన్నత విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. తిరుపతి, అమరావతి, విశాఖపట్నం విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్న విషయంలో స్పష్టత లేదు.

–పీ.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

విద్యకు మొండిచెయ్యి



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీసం 10 శాతం కూడా సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా లేదు. బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌పై బడ్జెట్‌లో ఊసేలేదు. కనీసం తల్లికి వందనం పథకానికి సుమారు రూ.10వేల కోట్లు అవసరం ఉండగా కేవలం రూ. 2వేల కోట్లు కేటాయించడం దారుణం.

–వీ.రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

కార్తీక దీపోత్సవం



శోభాయమానంగా శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణి

జిల్లాలోని శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. కార్తీక రెండో సోమవారాన్ని పురస్కరించుకుని తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణి, తిరుపతిలోని కపిలతీర్థాలు కార్తీక దీపాలతో శోభాయమానంగా దర్శనమిచ్చాయి. - శ్రీకాళహస్తి

ఘనంగా మౌలానా జయంతి

తిరుపతి అర్బన్: భారతరత్న, దేశ మొదటి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ విద్యాభివృద్ధికి చేసిన సేవలు మరుపురానివని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ గుర్తుచేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ముస్లిం మైనారిటీ సంక్షేమశాఖ అధికారుల నేతృత్వంలో మౌలానా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొప్ప విద్యా విధానానికి పునాది వేశారని, నిరక్షరాస్యత నిర్మూలనకు, ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.



మౌలానా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

వినియోగదారులకు పంగనామాలు

- ఏజెంట్లకు భూమి రిజిస్ట్రేషన్
- విశాఖ కేంద్రంగా ఏర్పాటైన ఓ కంపెనీ నిర్వాకం

రేణిగుంట: విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమైన వెల్ఫేర్ గ్రూప్ కంపెనీ కస్టమర్ల దగ్గర డిపాజిట్లు సేకరించి భూమి ఇస్తానని నమ్మబలికి బోర్డు తిప్పేసింది. కస్టమర్లు ఎదురు తిరగడంతో ఏజెంట్లను అడ్డుపెట్టుకుని వారిని మభ్యపెడుతూ కస్టమర్ల భూములను కట్టబెట్టేందుకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా తతంగం నడుస్తోంది. వివరాల్లోకి వెళితే.. 1999లో మార్చి 3వ తేదీ విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమైన వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ ఇంటర్ డబ్బులు డిపాజిట్‌గా చేస్తే ఐదేళ్లకు భూమి గానీ, డబుల్ అమౌంట్ గానీ ఇస్తామని నమ్మించి ఆశ చూపింది. భూమి ఇస్తారనే ఆశతో కస్టమర్లు ఎగబడి మరీ డిపాజిట్లు నెలవారీ పద్ధతిలో చెల్లించారు. తొమ్మిది రాష్ట్రాల్లో 380 బ్రాంచ్‌లకు విస్తరించిన ఈ కంపెనీ 2010లో సుమారు రూ.3,000 కోట్లకు పైగా వసూలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రూ.600 కోట్లు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.30 కోట్లు దాకా వసూలు చేసినట్లు సమాచారం.




వికృతమాలలో వివాదాస్పద భూములు

మెచ్యూరిటీ అయిన తర్వాత తమ డబ్బుకు భూమి ఇవ్వాలని కస్టమర్లు డిమాండ్ చేయడంతో భూమి ఇవ్వలేము డబుల్ డబ్బులు ఇస్తామని మాటమార్చి, ఇచ్చిన చెక్కులు కొందరికి బౌన్స్ అయ్యాయి. కస్టమర్లకు డబ్బు తిరిగి ఇవ్వలేక 2014లో కంపెనీ మూసేశారు.

వివాదాస్పద భూమిని కట్టబెట్టే ప్రయత్నం

ఏర్పేడు మండలం, వికృతమాల వద్ద అప్పట్లో కొన్న ఎనిమిది ఎకరాల 10 సెంట్ల భూమిలో పక్కనే ఉన్న రోడ్లు, కాలువలు, డీకేటీ బఫర్ జోన్‌లో ఉన్న మరికొంత భూమి ఆక్రమించి 13.4 ఎకరాలలో వెంచర్ వేసి అమ్మాలని చూశారు. సర్వే నం.302 ఏటి పోరంబోకు 303, గెడ్డ పోరంబోకు 306లో డీకేటీ 343/2, పాఠశాలకు కేటాయించిన ఆట స్థలం, ఇతరులకు చెందిన రెండు ఎకరాల పొలం కలుపుకొని వెంచర్ వేసి ఏజెంట్లకు ఆ ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేసి కస్టమర్ల కడుపులు కొట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కన్వర్షన్ కాని భూమిని ఎలా ప్లాటింగ్ చేసి అమ్ముతున్నారు అనేదానికి సరైన వివరణ దొరకలేదు. కొన్ని రోజులుగా నియోజకవర్గంలో ఉన్న ఏజెంట్ల పేరుతో ఈ వెంచర్‌లోని 9 ప్లాట్లను తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా గత శుక్రవారం రాత్రి రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా కూడా ఈ సంస్థ ఇదే తరహాలో డిస్ప్యూట్ ల్యాండ్లను ఏజెంట్లకు కట్టబెట్టి కస్టమర్ల నోరు కొడుతోంది.



ఈ వెంచర్ చూపించే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు

డిస్ప్యూట్ జాబితాలో లేకపోవడంతోనే రిజిస్ట్రేషన్లు

ఈ భూమికి సంబంధించి మా సైట్లో అబ్జెక్షన్ జాబితాలో లేకపోవడంతో రిజిస్ట్రేషన్ చేస్తున్నాము. గతంలో ఇదే వెంచర్లో 23 ప్లాట్లు అమ్మడం జరిగింది. మిగిలిన వాటిని మాత్రమే ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తున్నాం.

- సుధాకర్, సబ్‌రిజిస్ట్రార్, తొట్టంబేడు

క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్



చంద్రగిరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని చంద్రగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ సుబ్బరామిరెడ్డి వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా, సంఘం మండలం నుంచి అక్రమంగా ఇసుకను లోడ్డు చేసుకుని కర్ణాటకకు చెందిన లారీ చంద్రగిరి మీదుగా బెంగళూరు వైపు వెళ్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని పనపాకం టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

– ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన సురేష్

గూడూరు రూరల్: గూడూరు రూరల్ ప్రాంతంలోని చెమిర్తి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. వెంకటగిరి వైపు నుంచి గూడూరు వైపు వస్తున్న ట్రాలీ లారీ చెమిర్తి వద్దకు చేరింది. అదే సమయంలో గిరిజన కాలనీ నుంచి బైక్‌లో మొలకల సురేష్ అనే వ్యక్తి రోడ్డుపైకి వస్తుండగా ట్రాలీ లారీ బైక్‌ను ఢీకొంది. సురేష్ పక్కనే ఉన్న వాగులోకి పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలయ్యా యి. ట్రాలీ డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. గాయపడిన వ్యక్తిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపడొద్దు.. ప్రలోభాలకు లోనుకావొద్దు

- పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ప్రత్యేక కోర్టులు
- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు ఉంచకండి
- అవగాహన సదస్సులో ఎస్పీ, కలెక్టర్



హాజరైన అధికారులు, విద్యార్థులు

తిరుపతి క్రైమ్: బాలికలు, మహిళలు భయపడొద్దు.. ప్రలోభాలకు గురికావద్దని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. సోమవారం పద్మావతి కాలేజీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సైబర్ నేరగాళ్లు, డ్రగ్, అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు హాజరయ్యారు. ఆయనతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 900 పాఠశాలల నుంచి వర్చువల్‌గా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ డీజీపీ విద్యార్థులకు సైబర్ క్రైమ్‌లు, మాదక ద్రవ్యాల వినియోగం, చిన్నపిల్లలు, మహిళలపై జరుగుతున్న రాజకీయాల గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

అనంతరం ఎస్పీ, కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఆడపిల్ల, మహిళా నేటి ఆధునిక తరంలో శక్తివంతంగా ఉండాలని ఆకాంక్షించారు. సైబర్ క్రైమ్ ద్వారా యువతీయువకులు ఎక్కువగా ప్రలోభాలకు గురవుతున్నారని, సైబర్ క్రైమ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితుల్లో ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న పిల్లల చేత భిక్షాటన చేయించేలా కొందరు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో మహిళా పోలీసులు బాల్యవివాహాల నిర్మూలన దిశగా శ్రద్ధ పెట్టాలని చెప్పారు.

శిక్షలు పడుతున్నా నేరాలకు పాల్పడుతున్నారు

సమాజంలో మహిళలు, చిన్నపిల్లల పట్ల అనేక నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షలు విధిస్తున్నా మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని కలెక్టర్, ఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఏదైనా తెలిస్తే 100, 112, తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 80999 99977కు సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. టీనేజ్ పిల్లలు, యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మహిళా విశ్వవిద్యాలయం ఉపకులాపతి ఉమా, అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), శ్రీరవిమనోహరాచారి, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీలత, మహిళా యూనివర్సిటీ రిజిస్టర్ రజిని, సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగజాతరలో సిండికేట్లా?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- కులమతాలకు అతీతంగా జరిగే జాతరను రాజకీయం చేయకండి
- శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే హితవు

శ్రీకాళహస్తి: ఆచారంగా వస్తున్న ఏడు గంగమ్మల జాతర ఉత్సవ కమిటీ రాజకీయ జోక్యం తగదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగి సుబ్బరామిరెడ్డి నుంచి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి వరకు ఎప్పుడూ గంగజాతర కమిటీలో ఎవరూ జోక్యం చేసుకోలేదన్నారు. కానీ నేడు ఎన్నో తరాలుగా కొనసాగుతున్న ఉత్సవ కమిటీలను పక్కన పెట్టి తాము నిర్వాహకులమంటూ కొందరు దందాలకు పాల్పడాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే జరిగే ఏడు గంగమ్మల జాతర కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చేసుకునే పండుగని, ఆ ప్రతిష్టను దిగజార్చి మద్యం సిండికేట్‌లాగా చేయాలనుకోవడం బాధ కలిగించిందన్నారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్లలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఎస్పీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నించే మీడియా ప్రతినిధులపై గంజాయి కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఆలయ కాంట్రాక్టుల్లో గోల్‌మాల్

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి స్క్రాప్ టెండర్‌లో గోల్‌మాల్ జరిగిందని... గతంలో రూ.23కు కొనుగోలు చేసిన ఐరన్‌ను ఇపుడు టీడీపీ నాయకులకు రూ.11కే కట్టబెట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే ఆక్షేపించారు. దుర్గమ్మ కొండపై ఏర్పాటు చేసిన రేకుల షెడ్డుకు టెండర్లు పిలవకనే పనులు చేయడంలో మతలబు ఏంటో చెప్పాలని నిలదీశారు. ఆ పని చేసిన దాతల వివరాలను శిలాఫలకంపై ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, శ్రీవారి సురేష్, కృష్ణయ్య, విజయకుమార్, రవి, పెరుమాళ్, మహేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతిలోని ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో జరిగిన క్రీడ, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రసంగించారు. విద్యార్థి దశ కీలకమని, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నప్పుడే తమలోని సృజనాత్మకశక్తి బయటపడుతుందన్నారు. అనంతరం ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుందన్నారు. ఈ పోటీలలో రాష్ట్రంలో ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని సుమారు 18 కళాశాలల నుంచి 410 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగేఈ సమ్మేళనంలో మొదట రోజు బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్ విభాగాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, వ్యవసాయ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవి కాంత్‌రెడ్డి, బోధనా పాల్గొన్నారు .

రుయాలో అదనపు ఓపీ కేంద్రాలు



నూతన కేంద్రాలలో ఓపీ తీసుకుంటున్న రోగులు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు ఓపీ కేంద్రాలను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రవి మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం ఓపీ కేంద్రాలను పెంచామని తెలిపారు. దీంతో రుయాలో ఓపీ కేంద్రాలు ఏడుకు పెరిగాయన్నారు. ఎంత రద్దీ ఉన్నా సుమారు 11గంటలలోపు ప్రతి రోగికీ ఓపీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. త్వరలో మరో రెండు ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

టీడీపీ రక్తచరిత్రకు యువకుడి బలి



ఎమ్మెల్యేతో నిందితుడు జగన్ (వృత్తంలోని వ్యక్తి)

- బర్త్‌డే పార్టీలో యువకుడికి కత్తిపోట్లు
- పాత కక్షల కారణంగానే దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తెలుగుదేశం పార్టీ నాయకుల రక్త చరిత్ర, అరాచకాలకు ఓ యువకుడు బలయ్యాడు. టీడీపీకి చెందిన యువకులు జగన్, వాసుదేవ, మునిరాజా, భరత్‌కుమార్ ఈనెల 6వ తేదీ సాయంత్రం పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలో తమ స్నేహితుడు విష్ణువర్ధన్ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయ సమీపంలో కేక్ కట్ చేశారు. పాతగొడవల కారణంగా కేక్ కట్ చేసిన కత్తితోనే జగన్ అనే యువకుడు విష్ణువర్ధన్‌పై దాడికి తెగబడ్డాడు. నాలుగు పోట్లు పొడవగా.. మిగిలిన వారు అతనికి సహకరించారు. తీవ్ర గాయాలపాలైన విష్ణువర్ధన్‌ను స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఐదు రోజులు రుయాలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ హత్యకు కారణమైన వారందరూ టీడీపీ వారే. ఇదిలావుండగా మృతునికి అమ్మానాన్న లేరు. సుబ్బు, విష్ణువర్ధన్ అన్నదమ్ములు కాగా.. అన్న సుబ్బు మధ్యలోనే చదువు ఆపేసి తమ్ముడు విష్ణువర్ధన్‌ను చదివిస్తున్నాడు. అయితే విష్ణువర్ధన్ చనిపోవడంతో కుటుంబంలో విషాదం అలముకుంది. దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్న డిమాండ్ చేశారు.

బాలుడిపై పోక్సో కేసు

- బాలిక వాంగ్మూలం ఆధారంగా చర్యలు
- ఎస్పీ సుబ్బరాయుడు



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: ఎర్రవారిపాళెం మండలం, యల్లమందలో ఈనెల నాలుగో తేదీన జరిగిన ఘటనలో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి చదువుతున్న బాలిక, బాలుడు స్నేహితులని తెలిపారు. ఈనెల నాలుగో తేదీ సాయంత్రం బాలిక బడి నుంచి బయట వచ్చాక స్నేహితుడితో కలసి వెళుతూ ఇంటికి చేరుకునేందుకు ఆలస్యం అయ్యింది. దీంతో తల్లిదండ్రులు వెతుక్కుంటూ వెళ్లారన్నారు. తనను ఎక్కడ కొడుతారో అన్న భయంతో బాలిక తనపై ముసుగు వేసుకుని మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి దాడిచేశాడని అబద్ధం చెప్పింది. తల్లిదండ్రులు ఆమెను యల్లమంద ప్రాథమిక వైద్యకేంద్రానికి తీసుకెళ్లారన్నారు. అనంతరం పోలీసులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి మెటర్నిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. డీఎస్పీ, తహసీల్దార్, మహిళా పోలీసులు, ఐసీడీసీ అధికారులు, తల్లిదండ్రుల సమక్షంలో బాలికను విచారించగా ఈ నాటకం బయటపడిందన్నారు. తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో గాజులతో చేతికి గాయం చేసుకున్న బాలిక.. ముసుగు వ్యక్తులు దాడిచేసి మత్తు మందు తాగించారని నమ్మించిందని చెప్పారు. ఆ బాలుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

సున్నిత విషయాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇలాంటి సున్నితమైన విషయాలు జరిగిన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పోక్సో కేసుకు సంబంధించి బాలిక వివరాలు తెలిసేలా ఏదీ చేయకూడదన్నారు. ఈ కేసులో నిజానిజాలు తెలుసుకోకుండా.. దర్యాప్తు అధికారులకు కనీసం సమయం కూడా ఇవ్వకుండా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేశారని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏఎస్పీలు వెంకటరావు, రవిమనోహరాచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్టు తీస్తున్నారు!

- మత్తు వదిలిస్తున్న అధికారులు
- రంగంలోకి జిల్లా కలెక్టర్, ఎస్పీ
- బెల్టు నిర్వాహకులను అరెస్ట్ చేయాలని ఆదేశాలు
- చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మర దాడులు
- నలుగురు అరెస్ట్, 212 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం విక్రయిస్తున్న వెంకటసుబ్బయ్యను అరెస్ట్ చేసిన రూరల్ ఎక్సైజ్ పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లాలో 'బెల్టు' తీసేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు నడుం బిగించారు. ఎక్కడ బెల్టు షాపులు కనిపించినా వెంటనే అరెస్టులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బెల్టు రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులమై ఉన్నామని అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా 98 బెల్టు షాపులను నిర్వహిస్తున్నట్లు ఆధారాలతో పలు పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై ఆరా తీశారు. బడ్డీ కోట్లు, కూల్ డ్రింక్ షాపుల్లో నిత్యావసర సరుకుల్లా అమ్మకాలు చేస్తున్న వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగ మల్లీశ్వర్‌రెడ్డి స్పందించారు. మద్యం షాపుల వారీగా గ్రామాల్లో అమ్మకాలు చేస్తున్న బెల్టుషాపులు, వాటి నిర్వాహకులను అరెస్ట్ చేయాలని రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దీంతో చిత్తూరు నుంచి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, చంద్రగిరి, తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. బెల్టుషాపులను గుర్తించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో సోమవారం ఒక్కరోజే బెల్టుషాపులను నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలో వెంకటసుబ్బయ్యను, చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లిలో కళత్తూరు రామును, ఎర్రావారిపాళెం మండలం, మట్టువారిపల్లిలో శోభ, సుబ్బారెడ్డిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి 212 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క మట్టువారిపల్లిలోని సుబ్బారెడ్డి బెల్టుషాపులోనే కేసుల కొద్దీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. అతని నుంచి 142 మద్యం బాటిళ్లు, 12 బీర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు బయటపడడంతో ఎక్సైజ్ పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. బెల్టుషాపులపై నిరంతరం దాడులు కొనసాగిస్తామని చంద్రగిరి, తిరుపతి రూరల్ సీఐలు ఫణీంద్ర, నరసానాయుడు హెచ్చరించారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

జిల్లాలో ఎక్కడా బెల్టు షాపులు అనేది లేకుండా చేస్తాం. నిరంతరం దాడులను కొనసాగిస్తాం. పక్కా ఆధారాలతో దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించాం. బెల్టుషాపులను ప్రోత్సహించే అధికారులు, మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశాం.

– వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న బెడ్ రూంలోని వస్తువులు

చంద్రగిరి: ఉపాధ్యాయుడి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బంగారు నగలు, వెండి వస్తువులతో పాటు నగదు దోచుకెళ్లిన ఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో చోటు చేసుకుంది. బాధిత బంధువుల వివరాల మేరకు... ప్రశాంతి నగర్‌కు చెందిన ఉపాధ్యాయులు వెంకటరమణ, ప్రసన్న లక్ష్మి రెండు రోజుల క్రితం ఒడిశాలోని తన తమ్ముడి ఇంట్లో ఓ కార్యక్రమానికి వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. పడక గదిలోని అల్మారాలో సుమారు రూ.13 లక్షల విలువైన 20 సవర్ల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు, రూ.50వేల నగదుతో పాటు పట్టు చీరలను దోచుకెళ్లారు. సోమవారం ఉదయం తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు ఉపాధ్యాయుల బంధువులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూజ్ టీం అధికారులు వేలి ముద్రలను సేకరించారు. దీనిపై సీఐ సుబ్బరామిరెడ్డిని వివరణ కోరగా.. బాధితులు ఒడిశా నుంచి వస్తున్నారని, ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు గ్రామ సమీపంలో కూటమికి చెందిన ఓ నేత యార్డ్ నుంచి అక్రమంగా ఖనిజ సంపదను రవాణా చేసే లారీని సోమవారం సాయంత్రం అధికారులు పట్టుకున్నారు. లారీని వదిలిపెట్టేందుకు టీడీపీ నేతలు పైరవీలు సాగించడంతో ఖనిజాన్ని పూర్తిగా ఆన్‌లోడ్ చేసి లారీని రోడ్డుపైనే ఉంచారు. అక్రమంగా ఖనిజాన్ని తరలించే ఈ లారీపై కేసును నమోదు చేస్తారా? లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన కమలమ్మ

రామచంద్రాపురం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పచ్చికాపల్లం –తిరుపతి ప్రధాన రహదారి పీవీపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం, గుంతలచేను గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, కమలమ్మ భార్యాభర్తలు. వీరు తిరుపతిలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్యం, కమలమ్మ తన ద్విచక్ర వాహనంపై గుంతలచేను నుంచి తిరుపతికి వెళ్తుండగా పీవీపురం వద్ద ఆవు అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో వెనుకవైపు కూర్చున్న కమలమ్మ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి తిరుపతి రుయాకు తరలించారు. రుయా వైద్యులు పరీక్షించి అప్పటికే కమలమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. సుబ్రహ్మణ్యం రుయాలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలికి మూడేళ్ల పాప ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.